క్లుప్తంగా

నేడు ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, వంటి ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. నరాల సమస్యలతో బాధపడుతున్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఇసీ దినేష్‌రెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568 86189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేడు ఎల్లమ్మ జాతర



ఎల్లమ్మ తల్లీ ఆలయం

వల్లూరు (చెన్నూరు) : చెన్నూరు కేటీఆర్ కాలనీలో ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద ఆదివారం జాతర నిర్వహించేందుకు కమిటీ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం నుంచి మూడు రోజులపాటు ఎల్లమ్మ దేవత అన్నగారైన పోతులూరయ్యస్వామి ప్రతిమను చెన్నూరు పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఈ ఊరేగింపులో పోతులూరి అయ్యా తన సోదరి ఎల్లమ్మకు పసుపు కుంకుమలు, బేడలు ఇతర దినుసులు ఇంటింటికి వెళ్లి సేకరించారు. మూడవ రోజు తన సోదరి ఎల్లమ్మకు సమర్పిస్తారు. అదే రోజున పోతులూరి అయ్యాను చెన్నూరులో ఉన్న బ్రాహ్మణ వీధిలో వెలసిన ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి ఆదివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. పోలీసులు ఊరేగింపు సమయంలో గట్టి బందోబస్తు నిర్వహిస్తారు.

వర్షపు నీటిని సంరక్షించుకోవాలి

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరూ వర్షపు నీటిని సంరక్షించుకోవాలని కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారిణి జయమ్మ తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కళాశాల ఆసోసియేట్ డీన్ ఎం.మాధవ ఆధ్వర్యంలో నీరు – మీరు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారిణి మాట్లాడుతూ ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం, తదితర పద్ధతుల ద్వారా నీటి వనరులను కాపాడుకుంటే భూగర్భజలాలపై ఒత్తిడి తగ్గి బోర్లు వేసే అవకాశం ఉండదన్నారు. అనంతరం ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు కళాశాల భవనం ఎదురుగా ఉన్న చెక్‌డ్యాం ప్రాంతంలో ముళ్ల కంపలను, చెత్తాచెదారాలను తొలగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో టెన్త్ ప్రశ్నా పత్రాలు

పులివెందుల రూరల్ : పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం భద్రపరిచారు. పదవ తరగతి పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈనెల 19 నుంచి సప్లమెంటరీ పరీక్షలను నిర్వహించనుంది. ఇందుకోసం పరీక్షా ప్రశ్నాపత్రాలను పులివెందుల పోలీస్‌స్టేషన్‌లో సంబంధిత విద్యా శాఖ అధికారుల సమక్షంలో భద్రపరిచారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

వేంపల్లి : గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టి ప్రజలను రోగాల బారి నుండి కాపాడాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధృవకుమార్‌రెడ్డిలు తెలిపారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వారు పార, పరక చేతబట్టి వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో ఉన్న స్వచ్ఛంద చెత్త తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ 'బంగారు' కొండలు వీరే!

అనంతపురం: జేఎన్‌టీయూ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన స్నాతకోత్సవానికి చాన్స్‌లర్ హోదాలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరయ్యారు. స్నాతకోత్సవాన్ని పురస్కరించుకుని పీజీ, పీహెచ్‌డీ, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. మొత్తం 41 బంగారు పతకాలు ఇవ్వగా, 27 బంగారు పతకాలు అమ్మాయిలే సాధించడం గమనార్హం. బంగారు పతకాలు పొందినవారిలో సయ్యద్ మహమ్మద్ అక్రమ్ మెకానికల్ శ్రీ రాజేశ్వరి కళాశాల, ప్రొద్దుటూరు, వెలిశెట్టి వెంకట నాగమణి ఏఐ, డేటా సైన్స్ అన్నమాచార్య, కడపతో పాటు జేఎన్‌టీయూ పులివెందులకు చెందిన పి. అమృత బాబు సివిల్ ఇంజినీరింగ్, పుల్లా భవ్యశ్రీ ఈఈఈ, వి. మహిత మెకానికల్ ఇంజినీరింగ్, ఓ గ్లెస్సియా ఈసీఈ, ఎం. వాసంతి సీఎస్‌ఈ ఉన్నారు.

నగరంలో మోస్తరు వర్షం

కడప కార్పొరేషన్ : కడప నగరంలో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటలకు మొదలైన వాన మధ్య మధ్యలో విరామం ఇస్తూ సాయంత్రం వరకూ కొనసాగింది. వర్షం వల్ల రహదారుల్లో నీరు నిలిచింది. డ్రైనేజీ కాలువలు పొంగి ప్రవహించాయి.

నాణేలు, కరెన్సీ నోట్ల సేకరణలో దిట్ట

- దేశ, విదేశాలకు చెందిన కరెన్సీలను సేకరించిన నారాయణస్వామి
- ఇంట్లో పదిలంగా భద్రపరిచిన రాజుల కాలం నాటిన వస్తువులు



ఈస్టిండియా కంపెనీ ముద్రించిన సీతారాముల నాణేలు



పురాతన వస్తువులతో నారాయణస్వామి

పులివెందుల టౌన్ : వేల ఏళ్ల చరిత్రకు సంబంధించిన అరుదైన ఆనవాళ్లు ఆయన వద్ద నిక్షిప్తమై ఉన్నాయి. ఒకవైపు రాజకీయంలో ఉంటూ నాటి చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు తెలియజెప్పే నాణేల సేకరణకు శ్రీకారం చుట్టారాయన. సుమారు వేలకు పైగా నాణేలను సేకరించి ఔరా అనిపించుకుంటున్నారు. ఆయనే పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లె రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘ జనరల్ సెక్రటరీ అంబకపల్లె నారాయణస్వామి. గతంలో వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా పనిచేశారు. భారతదేశాన్ని పాలించిన అక్బర్, బాబర్, ఔరంగజేబు, శ్రీకృష్ణదేవరాయలు రాజుల కాలం నాటి నాణేలు, వివిధ దేశాల కరెన్సీ నోట్లు, రాజుల కాలం నాటి కిరోసిన్ దీపాలు, ఫ్యాన్లు ఆయన వద్ద ఉన్నాయి. ఈస్టిండియా కంపెనీ వారు 1616లో ముద్రించిన సీతారాముల ప్రతిమలతో కూడిన అరుదైన నాణేం ఆయన సొంతమైంది. 12, 14 దశాబ్దాలలో మొగల్ సామ్రాజ్య చక్రవర్తులైన బాబర్, అక్బర్ కాలంలో చెలామణిలో ఉన్న జార్జికింగ్, లిచే ఎంపోరియం కాలం నాటి నాణేలు కూడా ఆయన వద్ద ఉన్నాయి. ఇండియా, అమెరికా, చైనా, భూటాన్, ఆస్ట్రేలియా, శ్రీలంక, కువైట్ తదితర దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, నాణేలు ఆయన సేకరించి ఇంట్లో పదిలంగా దాచుకున్నారు. పూర్వీకులు, స్నేహితుల తోడ్పాటుతో స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత ప్రభుత్వాలు ముద్రించిన నాణేలు, కరెన్సీ నోట్లు పదిలంగా ఉంచుకున్నారు. ఆయన ఇంట్లో ఉన్న పురాతన కాలం నాటిన వస్తువులు, కిరోసిన్‌తో వెలిగించే దీపాలు, ఫ్యాన్లు, గౌతమ బుద్ధుని విగ్రహం, పూర్వకాలం నాటి స్టాంపులు ఉన్నాయి. 1818లో ఈస్ట్ ఇండియా కంపెనీ తయారుచేసిన 6 స్టార్ ట్రయాకర్ టెలీస్కోప్‌లు దాదాపు 20 దాకా ఉన్నాయి. 50 రకాల రెడియోలు, సండే వాల్ క్లాక్ ఉంది. ఇది వారానికి ఒకసారి కీ ఇస్తే వారం రోజుల పాటు పనిచేస్తుంది. ఇతల్ కుర్చీలు, వందకుపైగా గోడగడియారాలు, 20వేల వరక పురాతన వాచీలు, 15 వేల రకాల పెన్నులు నిశిప్తంగా దాచి ఉంచారు. లండన్ టైప్‌మిషన్ లండన్‌లో ఒకటి, రెండవది ఈయన దగ్గర ఉంది. ఈయన ఇళ్లు చూస్తే ఒక మ్యూజియంను తలపిస్తుంది.

విదేశీలుయులు వాడే నాణేలు గుర్తించవచ్చు

వివిధ దేశాల కరెన్సీ, నాణేల సేకరణవల్ల ఆయా దేశాల సంస్కృతులు తెలుసుకోవచ్చు. వీటిని భద్రపరిచి భావి తరాల వారు తెలుసుకునేలా చేయడమే నా లక్ష్యం. ప్రభుత్వం అనుమతిస్తే నాణేలు, కరెన్సీ నోట్లతోపాటు పూర్వకాలం నాటి పరికరాలు, మరన్ని వస్తువులతో ప్రదర్శన ఏర్పాటు చేసి ప్రజలకు వీటిని తెలియజేయాలని ఉంది. ఇక మ్యూజియాన్నే ఏర్పాటు చేయాలని ఉంది. ఇందుకోసం ఎంతో ఖర్చుచేశాను. వీటిని సేకరించడమంటే నాకు ఎంతో ఇష్టం.

– నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ, వాల్మీకి సంఘ జనరల్ సెక్రటరీ, పులివెందుల



భారతదేశంలోని పూర్వకాలం నాటి నాణేలు, విదేశాలకు చెందిన కరెన్సీ నోట్లు

50 శాతం సబ్సిడీతో పశు దాణా

కమలాపురం : ఏపీ ప్రభుత్వం కరువు నివారణలో భాగంగా పాడి రైతులకు 50 శాతం సబ్సిడీతో పశు దాణా పంపిణీ చేస్తున్నట్లు మండల పశు వైద్యాధికారి మల్లికార్జునరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశలో భాగంగా మండలానికి 50 కిలోల బస్తాలు 138 మంజూరైనట్లు ఆయన అందులో తెలిపారు. దాణా పొందే రైతులు రేషన్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. అలాగే 21వ పశు గణనందు పేరును నమోదు చేసుకుని ఉండాలని, క్రమం తప్పకుండా గాలికుంటు వంటి టీకాలు పశువులకు వేసుకుని ఉండాలన్నారు. ఒక రైతుకు కేవలం ఒక బస్తా మాత్రమే ఇస్తామని, బస్తా ధర రూ.1100 కాగా 50 శాతం సబ్సిడీ రూ.555 ప్రభుత్వం భరిస్తుందని, రైతు వాటాగా రూ.555 చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాడి పరిశ్రమ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

మన సైనికులకు అండగా ఉందాం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : దేశ రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న మన సైనికులకు మనమందరం అండగా ఉందాని ఎమ్మెల్యే చైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. ఆపరేషన్ సింధూర్ విజయోత్సం సందర్భంగా త్రివిధ దళాల సైనికులకు సంఘీభావం తెలుపుతూ శనివారం స్థానిక క్రాస్ రోడ్డు నుంచి రైల్వే గేటు వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైనికుల శక్తి సామర్థ్యాలకు బాసటగా నిలుద్దామన్నారు. దేశ రక్షణ కోసం నిరంతరం పోరాడుతున్న వారికి మనమంతా అండగా నిలుద్దామని పిపుపునిచ్చారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, విద్యార్థులు గెలుపోటములను స్ఫూర్తిగా తీసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని రింగ్ రోడ్డు సమీపంలో ఉన్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియంలో వైఎస్ అభిషేక్‌రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర హాలు గంగాధరరెడ్డి, వైఎస్సార్‌సీపీ దూదేకుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్‌లు 6వ రోజు జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌ను టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి క్రీడలలో గెలుపోటములు సహజమేనన్నారు. విన్నర్ జట్టుకు రూ.60వేలు, రన్నర్ జట్టుకు రూ.30వేలు, మూడవ బహుముతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్రికెట్ టీం ఆర్గనైజర్స్ శ్రవణ్‌రెడ్డి, చిన్నా, సుమంత్, చెన్నయ్య, మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు రామ్‌కుమార్‌శర్మ, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక న్యాక్ బిల్డింగ్ సమీపంలోని వైఎస్ చిన్నకొండారెడ్డి రజక కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీగంగమ్మతల్లి విగ్రహ ధ్వజ శిఖర కలశ పోతులయ్య విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెండవ రోజు శనివారం వేద పండితులు రామ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రాతఃకాల పూజ, మంత్ర జపములు, చండీ హోమాన్ని నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన 108 రకాల పూజాది ద్రవ్యాలు, సుగంద ద్రవ్యాలను సమర్పించారు. సాయంత్రం ప్రదోషకాల పూజ, శ్రీరుద్రదుర్గా హోమాలు, మూలమంత్ర జపములు, సహస్రనామార్చాన, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. నేడు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంతోపాటు ధ్వజ శిఖర కలశ ప్రతిష్ట, మహా కుంభ బలి, పూర్ణాహుతి, తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

రెవెన్యూ కోర్టును సద్వినియోగం చేసుకోండి



ఆర్‌ఓఆర్ కేసులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ జాన్‌ఎర్విన్

కమలాపురం : మండల ప్రజల సౌకర్యార్థం ఆర్‌డీఓ కార్యాలయంలో నిర్వహించాల్సిన రెవెన్యూ కోర్టును ఇక నుంచి ప్రతి శనివారం కమలాపురం రెవెన్యూ కార్యాలయంలోనే నిర్వహిస్తామని కడప ఆర్‌డీఓ జాన్ ఎర్విన్ తెలిపారు. శనివారం కమలాపురం రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన రెవెన్యూ కోర్టులో చదిపిరాళ్ల, సంబటూరు, లేటపల్లె గ్రామాలకు చెందిన రైతుల ఆర్‌ఓఆర్ కేసులను విచారించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో ఆర్‌ఓఆర్ అప్పీల్‌కు సంబంధించి ఆర్‌ఓఆర్ చట్టం–1971 ద్వారా కడపలో నిర్వహించాల్సి ఉందన్నారు. అయితే మండలంలో వచ్చిన దరఖాస్తుల మేరకు ప్రజల సౌకర్యార్థం కమలాపురంలోనే రెవెన్యూ కోర్టు నిర్వహిస్తున్నామన్నారు. ఇక పై ప్రతి శనివారం నిర్వహించే రెవెన్యూ కోర్టును మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, డీటీ రోషిణి హుసేన్, ఎలక్షన్ డీటీ అహల్య, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్ని దానాలకన్నా నేత్రదానం గొప్పది



కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను అందుకుంటున్న రాజు

పులివెందుల టౌన్ : అన్ని దానాలకన్నా అంధులకు చూపునిచ్చే నేత్రదానం గొప్పదని, వెలకట్టలేనిదని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. శనివారం పట్టణంలో సగిలిబసిరెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించడంతో టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని ఇంటికి వెళ్లి కార్నియాలను సేకరించి మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మృతుడి కుటుంబ సభ్యుల చేతులమీదుగా కార్నియాలను అందుకున్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపించారు. అనంతరం రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసేందుకు నేత్రదానంపై అవగాహన కలిగి 9966609364, 7093204537 అనే ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. నేత్రదానానికి అంగీకరించిన మృతుని కుటుంబ సభ్యులకు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ వైఎస్ ప్రమీలమ్మ, పుర ప్రముఖులు వైఎస్ మధురెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, బంధువులు, సన్నిహితులకు నేత్ర సేకరణ కేంద్ర బృందం కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా గంగమ్మ తిరునాల



పగడాలపల్లెలో బండలాగుతున్న ఎద్దులు

పెండ్లిమర్రి : మండలంలోని పగడాలపల్లె గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మ అమ్మవారి తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా జరిగాయి. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, అభిషేకాలకరణ, అకుపూజ వంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణలో పలువురు దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అలాగే అవరణలో కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

గంగమ్మ అమ్మవారి తిరునాల ఉత్సవాల సందర్భంగా ఆలయ అవరణలో శనివారం సాయంత్రం ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలకు తొమ్మిది జతల ఎద్దులు పాల్గొన్నాయి. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యాజమానులకు ఆలయ కార్యనిర్వహకులు బహుమతులు అందజేశారు.


రక్తపోటుపై ప్రజలకు అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ రేష్మా, వైద్య, ఆరోగ్య సిబ్బంది

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం డాక్టర్ రేష్మా ఆధ్వర్యంలో ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా సిబ్బంది, ప్రజలకు రక్తపోటు గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తపోటు జీవన శైలి మార్పు ద్వారా, వంశపారంపర్యంగా, అధిక బరువు, ఆహార నియమాలు పాటించకపోవడం, ఉప్పు, నూనెలు అధికంగా వాడటం, తదితర కారణాలవల్ల వస్తుందన్నారు. చిన్న వయస్సు నుండే ఆహారపు అలవాట్లు, వ్యాయామం, ఒత్తిడి తగ్గించుకోవడం లాంటివి పాటించడం ద్వారా రక్తపోటు రాకుండా చేసుకోవచ్చునన్నారు. అనంతరం వైద్య, ఆరోగ్య సిబ్బంది రక్తపోటు నివారణ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో రక్తపోటును కొలవండి, నియంత్రించండి, ఎక్కువ కాలం జీవించండి అనే నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ విజయ, సూపర్‌వైజర్ శశికళ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుంకులమ్మ అమ్మవారు

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువుకట్టపై వెలసిన శ్రీ వరాల సుంకులమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతున్న సుంకులమ్మ 10వ తిరునాల మహోత్సవాన్ని పురస్కరించుకుని రెండోరోజు శనివారం అమ్మవారి మూల విగ్రహాలకు పండ్ల రసాలతో పంచామృత అభిషేకములు, గణపతి, నవగ్రహ, సుదర్శన, దుర్గా హోమాలు, శ్రీ మహాకాళీ, మహాలక్ష్మీ, మహా సరస్వతి పూజలు, అభిషేకములు, అవాహిత హోమములు, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు. భక్తులు ఆలయానికి తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు

బండలాగుడు పోటీలు

అలయ ఆవరణలో సేద్యపు ఎద్దులకు నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 8 కాండ్ల ఎద్దులు రాతి దూలాన్ని ఈడ్చాయి. విభరాపురంకు కు చెందిన ఎద్దులు మొదటి స్థానంలో నిలిచాయి. గెలుపొందిన విజేతలకు నిర్వాహకులు సున్నపు నాగేంద్ర, ఎన్‌సీ పుల్లారెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతులు రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2వేలు, రూ.1వెయ్యి అందజేశారు.

అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్‌ను అందుకుంటున్న షేక్ మహమ్మద్ ఆలీ

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక జెండామాను వీధికి చెందిన షేక్ మహబూబ్‌బాషా కుమారుడు, జెఎన్‌టీయూ అధ్యాపకుడు షేక్ మహమ్మద్ ఆలీకి శనివారం డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతపురం జెఎన్‌టీయూ 14వ స్నాతకోత్సవ వేడుకలో భాగంగా ఏపీ గవర్నర్ సయ్యద్ అబ్దుల్‌నజీర్, జెఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ సుదర్శనరావుల చేతుల మీదుగా మహమ్మద్ ఆలీ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈయన జెఎన్‌టీయూఏలో కెమిస్ట్రీ ప్రొఫెసర్ ఎస్.దేవన్న మార్గదర్శకత్వంలో ఎల్‌సీ–ఎంఎస్/ఎంఎస్ ఉపయోగించి ఫార్మస్యూటికల్ డ్రగ్స్‌లో జెనోటాక్సిక్ ఇంప్యూరిటీస్ గుర్తింపు, పరిమాణీకరణ కోసం విశ్లేషణ్మాతక పద్ధతుల అభివృద్ధి, వాలిడేషన్ అనే పరిశోధనకు డాక్టోరల్ డిగ్రీ లభించింది. మహమ్మద్ ఆలీ డాక్టరేట్ పొందడంపట్ల కుటుంబ సభ్యులు, తోటి అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

వడగాల్పులపై అప్రమత్తంగా ఉండండి



శ్రామికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : వడ గాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్ పర్సన్ మార్పూరి మేరి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మూడవ శనివారాన్ని పురస్కరించుకుని కమిషనర్ పగడాల జగన్నాథ్ అధ్యక్షతన నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. వేసవి కాలం ముగిసే వరకు ప్రజలు తరచూ మంచినీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలన్నారు. తలపై రుమాలు లేదా టోపీ ధరించాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న సమయంలో ప్రజలు శ్రమతో కూడిన భారీ కార్యకలాపాలు చేయరాదన్నారు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వీలైనంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బాల నరసింహులు, సీఓలు ప్రజ్యోత్, లావణ్య, మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికులు వేసవి జాగ్రత్తలు పాటించాలి

గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులు వేసవి జాగ్రత్తలు పాటించి వడదెబ్బకు గురి కాకుండా తమ పనులు చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. శనివారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లె పంచాయతీలో స్వర్ణ ఆంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. బీట్ ది హీట్ అంశం గురించి వివరించారు. మానవ హారం ఏర్పాటు చేశారు. స్వచ్ఛ దివస్ ర్యాలీ, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న శ్రామికులు 6 గంటలకే పని ప్రదేశంలోకి చేరుకుని 10 గంటలకు పనులు ముగిసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పనులు పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏపీఓ పార్థ సారధి, శ్రామికులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఉద్యోగులు వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్‌ఐ లోకేష్ తెలిపారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్యాకెట్ లీటర్ నీటిలో కలుపుకుని గంట గంటకు తాగితే వడదెబ్బకు గురి కాకుండా ఉంటారన్నారు. ఫీల్డ్‌కు పోయినప్పుడు తలకు టోపీలను ధరించడంతో పాటు తాగునీటి బాటిల్‌ను వెంట పెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో చక్రాయపేట సర్వేయర్ శివారెడ్డి, వేంపల్లె మండల వీఆర్‌ఓ, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి



రోడ్లను శుభ్రం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, తదితరులు

పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని భాకరాపురంలో మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మొక్కలు నాటి అక్కడ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు ప్రజలు, వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి మానవహారంగా ఏర్పడి స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు వడదెబ్బ తగలకుండా ఎండాకాలంలో ఎక్కువగా నీటిని తాగాలని, సూర్య కిరణాలు మీద పడకుండా గొడుగులు ఉపయోగించాలన్నారు. అనంతరం వారు రోడ్లను శుభ్రం చేశారు. కార్యక్రమంలో హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్ బాషా, బీజేపీ నాయకులు శశిభూషణ్‌రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, మెప్మా సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

గండి ఆలయ కుంభాభిషేకంలో జాప్యం తగదు

చక్రాయపేట : గండి ఆలయ కుంభాభిషేకం నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం కల్పించడంలో అధికారులు జాప్యం చేయడం తగదని తాళపత్ర గ్రంథలిపి నిపుణుడు నాగదాసరి మునికుమార్ ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఆలయ గర్భాలయం చుట్టూ ద్వారపాలకులు, ఒంటె వాహనం, ధ్వజస్తంభం, బలిపీఠం ఏర్పాటు చేసి పూర్తయిన ఆలయానికి పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అష్టబంధనం, మహాకుంభాభిషేకం నిర్వహించి వెంటనే భక్తులకు మూలవిరాట్ దర్శనం కల్పించాలని కోరారు.

నేడు ఉచిత ఒడుగులు

కడప కల్చరల్ : కడప నగరంలోని నజ్‌ముల్ అమీన్ హైస్కూలులో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి బాలురకు ఉచితంగా ఉచితంగా వడుగులు (ఖత్నా) కార్యక్రమం నిర్వహించనున్నారు. పెద్ద దర్గా దర్గా పీఠాధిపతి, అమీన్ ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. వడుగులు చేయించుకున్న వారికి సంప్రదాయ వస్త్రాలు, గోధుమపిండు, చెక్కెర, నెయ్యితోపాటు మందులు కూడా ఉచితంగా అందజేయనున్నారు.